చర్చలతోనే సహకారం

- మీతో భేటీకి నేనూ సిద్ధం
- ఏపీ సీఎం చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి లేఖ
- 6న ప్రజాభవన్‌లో సమావేశమవుదామని ఆహ్వానం

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబునాయుడుతో భేటీకి తాను సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విభజన సమస్యల పరిష్కారానికి చంద్రబాబు చేసిన భేటీ ప్రతిపాదనతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని వెల్లడించారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు మంగళవారం సీఎం రేవంత్ తిరిగి లేఖ రాశారు. ఇప్పటికే విభజన సమస్యలపై ఇద్దరం సమావేశమై చర్చించుకుందామంటూ సోమవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇందుకు అంగీకరిస్తూ ప్రత్యుత్తరమిచ్చారు. 'మీరు నాకు రాసిన లేఖను చదివాను. అందులో నా గురించి మంచి వ్యాఖ్యలు ప్రస్తావించినందుకు కృతజ్ఞతలు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మీరు సాధించిన అపూర్వ విజయానికి నా అభినందనలు. నాలుగో సారి సీఎంగా బాధ్యతలు చేపట్టి దేశంలోని అతి కొద్ది మంది రాజకీయ నేతల సరసన చేరారు' అని పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇద్దరం సమావేశమై ఆలోచనలను పంచుకోవటం తప్పనిసరి అని లేఖలో పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు ఈ సమావేశంలో చర్చించే అంశాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న సాయంత్రం మహాత్మా జ్యోతి రావ్‌పూలే ప్రజాభవన్‌లో భేటీ అవుదామని చంద్రబాబును ఆహ్వానించారు.

ఏపీ ఆధీనంలోని ఆస్తుల స్వాధీనానికి చర్యలు: కోమటిరెడ్డి

హైదరాబాద్, జూలై 2(నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబు, టీజీ సీఎం రేవంత్‌రెడ్డి మధ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి రాజధానిగా పదేళ్లపాటు ఏపీ ఆధీనంలో ఉన్న హైదరాబాద్ ఆర్‌అండ్‌బీ శాఖ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీకి చెందిన లేక్ వ్యూ గెస్ట్‌హౌస్, మినిస్టర్స్ క్వార్టర్స్, ఆదర్శనగర్, బషీర్‌బాగ్, కుందన్‌బాగ్, ఎమ్మెల్యే క్వార్టర్లు, గ్రీన్ లాండ్స్ గెస్ట్‌హౌస్, మంజీరా అతిథి గృహం తదితర వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీశ్, ఈఎన్‌సీ గణపతిరెడ్డి పాల్గొన్నారు.

కుమారి ఆంటీకి ఓ న్యాయం.. నాకో న్యాయమా?

- డబ్బా తొలగించి రోడ్డునపడేశారని కన్నీరు
- ప్రజాభవన్ ముందు మహిళ ఆవేదన
- మంగళవారం ప్రజావాణికి 601 దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నేడు బడ్డీకొట్టు పెట్టుకొని మూడేండ్లు అవుతున్నది. అందుకు మా పంచాయతీ మేడమ్ పర్మిషన్ ఇచ్చింది. ఆ డబ్బా కొట్టుతో ఐదుగురు ఆడబిడ్డల్ని సాదుతున్న. ఇప్పుడా డబ్బా తీసేసినరు. నేను ఎట్లా బతకాలి? ఆంధ్రా నుంచి వచ్చిన కుమారి ఆంటీ ఇక్కడ బతకొచ్చుకానీ.. తెలంగాణ వాళ్లం మేము బతకకూడదా సారు? ఆమెకొక న్యాయం మాకో న్యాయమా?' అని మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో ఓ మహిళ కన్నీటి పర్యంతమైంది. న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నది. రెండు వారాలుగా తిరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోలేదని వాపోయింది. ప్రజావాణికి 11 సార్లు వచ్చానని మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తూరుకు చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా ప్రజావాణికి రాలేదని, సెక్రటేరియట్‌కు వెళ్లినా కలవనీయటం లేదని వాపోయారు. భూమి సమస్య పరిష్కారానికి 6 నెలలుగా తిరుగు తున్నా పట్టించుకో వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లు, రేషన్ కార్డుల కోసం వెళ్తే.. అధికారులు దురుసుగా మాట్లాడుతున్నారని, ప్ర జావాణిని టైంపాస్ కోసం పెట్టామని అంటున్నారని హైదరాబాద్‌కు చెందిన పలువురు మహిళలు వెల్లడించారు. కష్టం చెప్పుకుందామని వెళ్తే.. అరెస్టు చేస్తామని, జుట్టు ఊడేదాక కొడతమని పోలీసులు అంటున్నారని వాపోతున్నారు. కాగా మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 601 దరఖాస్తులు అందినట్టు అధికార వర్గాలు తెలిపాయి. రెవెన్యూకు సంబంధించి 142, పౌరసరఫరాలశాఖకు సంబంధించి 87, మున్సిపల్ శాఖకు సంబంధించి 53, హోంశాఖకు సంబంధించి 47 దరఖాస్తులు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 52, ఇతర శాఖలకు సంబంధించి 220 దరఖాస్తులు అందినట్టు వివరించాయి. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇంట్లో పనిచేయలేదని సస్పెన్షన్ వేటు

మహిళా ఉద్యోగితో డీఎఫ్‌వో వెట్టిచాకిరీ • డీఎఫ్‌వో దంపతుల తీరుపై కన్నీటిపర్యంతం

భాగ్యలక్ష్మి

ములుగు, జూలై 2 (నమస్తేతెలంగాణ): ఇంట్లో పనిచేయడం లేదని తన శాఖలో కింది స్థాయి మహిళా ఉద్యోగిపై రిమార్క్‌లు చూపిస్తూ రెండుసార్లు సస్పెండ్ చేసిన ఘటన ములుగు అటవీ శాఖలో చోటుచేసుకున్నది. బాధిత మహిళా ఉద్యోగి గట్టికొప్పుల భాగ్యలక్ష్మి మంగళవారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద మీడియాకు వివరాలు వెల్లడించారు. భా గ్యలక్ష్మి అటవీ శాఖలో బంగ్లా వాచర్‌గా 2004లో ఉద్యోగంలో చేరారు. మంగపేట కార్యాలయంలో పనిచేయాల్సి ఉండగా ఓడీ బేసిస్‌లో డిప్యుటేషన్‌పై ములుగు రేంజ్ కార్యాలయంలో విధులు అప్పగించారు. కొంతకాలంగా డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్ ఈమెతో ఇంటి పనులు చేయించుకుంటున్నాడు. సద్దుల బతుకమ్మ సందర్భంగా పనికి రాకపోవడంతో అక్టోబర్ 26న సస్పెండ్ చేశాడు. ప్రాథేయపడగా మూడు నెలల తర్వాత తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. మళ్లీ డీఎఫ్‌వో ఇంట్లో పని అప్పగించారు. ఈ ఏడాది మే 20న తన మనుమడి పుట్టిన రోజు ఉన్నదని డీఎఫ్‌వో భార్యకు చెప్పి ముందస్తుగా వెళ్లింది. దీంతో జూన్ 28న మరోమారు సస్పెండ్ చేశారని బాధితురా లు తెలిపింది. ఈ విషయం మంత్రి కొండా సురేఖ దృష్టికి కూడా వెళ్లిందని ఆమె పేర్కొంది. డీఎఫ్‌వో దంపతులు తనపై కక్షగట్టడంతో మనస్తాపంతో ఫారెస్టు కార్యాలయం భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్తుండగా తోటి ఉద్యోగులు అడ్డుకున్నట్టు తెలిపింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నది.

వ్యవసాయ అధికారులు బాధ్యత మరవొద్దు

- వచ్చే మూడు, నాలుగు నెలలు కీలకం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- వ్యవసాయ వర్సిటీలో బీఆర్‌ఎస్ నిర్మించిన ల్యాబ్ ప్రారంభం

హైదరాబాద్, జూలై 2(నమస్తే తెలంగాణ): క్షేత్రస్థాయిలోని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులంతా బాధ్యతగా పని చేయాలని, వచ్చే మూడు, నాలుగు నెలలు రైతులకు, వ్యవసాయ శాఖకు చాలా కీలకమని తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు వేర్వేరు కాదని, రెండు శాఖల అధికారులు కలిసి సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన సమీకృత ప్రయోగశాలల భవన సముదాయంను మంత్రి ప్రారంభించారు. భూసార, విత్తన, ఎరువుల పరీక్షల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7.90 కోట్ల వ్యయంతో ఈ ల్యాబ్‌ను నిర్మించింది. దీన్ని ప్రారంభించిన అనంతరం జిల్లాస్థాయి వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రానున్న మూడు నెలల్లో రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా ద్వారా రూ.50-60 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు తెలిపారు. కాబట్టి అధికారులు జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.

మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ పీఠం ?

- కాంగ్రెస్ అధిష్ఠానం ఖాయం చేసినట్టు సమాచారం
- ఖర్గేను కలిసి ధన్యవాదాలు తెలిపినట్టు సన్నిహితుల వెల్లడి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షునిగా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అధిష్ఠానం ఖరారు చేసినట్టు సమాచారం. పార్టీ పెద్దల నుంచి సమాచారం అందుకున్న మహేశ్‌కుమార్ మంగళవారం ఢిల్లీ వెళ్లి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి ధన్యవాదాలు తెలిపినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ తెలంగాణకు చెందినవాడు కావడంతో.. పీసీసీ అధ్యక్ష పీఠాన్ని ఉత్తర తెలంగాణకు చెందిన వ్యక్తికి ఇవ్వడానికి అధిష్ఠానం మొగ్గుచూపినట్టు తెలిసింది. మహేశ్‌కుమార్‌గౌడ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లావాసి కావడం గమనార్హం. సీఎం రేవంత్‌రెడ్డి ఓసీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎస్సీకి చెందినవారు కావడంతో పీసీసీ అధ్యక్షుడిని బీసీ నుంచి ఎంపిక చేయాలని అధిష్ఠానం భావించడం కూడా మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కలిసివచ్చింది. పీసీసీ కోసం మాజీ ఎంపీ మధుయాష్కీ, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ చివరి దాకా ప్రయత్నించినప్పటికీ వీరిద్దరూ దక్షిణ తెలంగాణవారు కావడంతోపాటు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోవడం వల్ల వీరి అభ్యర్థిత్వాలను తిరస్కరించినట్టు తెలిసింది.

గవర్నర్ రాధాకృష్ణన్‌తో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

గవర్నర్‌తో మండలి చైర్మన్, స్పీకర్ భేటీ

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌తో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ భేటీ అయ్యారు. మంగళవారం రాజ్‌భవన్‌కు వెళ్లిన ఇద్దరు గవర్నర్‌తో పలు అంశాలపై చర్చించారు. అంతకు ముందు సీఎస్ శాంతికుమారి కూడా గవర్నర్‌తో భేటీ అయ్యారు. ముగ్గురు కీలక వ్యక్తులు ఒకేరోజు గవర్నర్‌ను కలువడం చర్చనీయాంశంగా మారింది.

ఫిరాయింపులకు నేను వ్యతిరేకం

› మొదటిపేజీ తరువాయి...

నుంచి గెలిచిన తర్వాత ఆ వ్యక్తి ఆ పార్టీకే అండగా ఉండాలని భావించే వ్యక్తిని నేను. స్పీకర్ హోదాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా నా ప్రయత్నం ఉంటది' అని చెప్పారు. అలాగే బీఆర్‌ఎస్ నుంచి ఫిర్యాదు చేస్తే రాజ్యాంగబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటానని తెలిపారు. ఈ అంశంలో స్థానిక కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాలను పాటిస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటివరకు తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రొటోకాల్ పాటించకుండా, అపాయింట్‌మెంట్ లేకుండా విజిటర్స్ మధ్యలో నుంచి వచ్చి దానం నాగేందర్‌పై చర్యలకు వినతిపత్రం ఇచ్చారని పేర్కొన్నారు. ఆ వినతిని కార్యదర్శికి పంపించానని, త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. తన పరిధిలో ఉన్న వాటిని తప్పకుండా ప్రజాస్వామ్య బద్ధంగా పరిష్కరిస్తానని చెప్పారు. స్పీకర్ హోదా తగ్గకుండా ప్రవర్తిస్తానని, తనపై సీఎం నుంచి ఎలాంటి ఆంక్షలు లేవని, పూర్తి స్వతంత్రంగా పనిచేస్తున్నానని తెలిపారు. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు శాసనసభ్యులు ఇటీవల కాంగ్రెస్‌లో చేరుతున్న నేపథ్యంలో స్పీకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

లోకం పోకడ

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36.0°c	25.0°c
మహబూబ్‌నగర్	35.3°c	26.2°c
రంగారెడ్డి	34.5°c	22.9°c
ఆదిలాబాద్	34.0°c	27.0°c
కరీంనగర్	34.0°c	27.0°c
హైదరాబాద్	33.6°c	24.6°c
నల్లగొండ	33.5°c	23.4°c
మెదక్	32.8°c	23.3°c
నిజామాబాద్	32.8°c	25.8°c
వరంగల్	29.0°c	25.0°c

ఆన్‌లైన్‌లో సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులు

వెబ్ సైట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) దరఖాస్తులను ఇక నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించనున్నారు. దీనికోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన వెబ్‌సైట్‌ను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సచివాయంలో ప్రారంభించారు. https//cmrf.telangana.gov.in\వెబ్‌సైట్‌లో ఉన్న దరఖాస్తుతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖను జతచేసి అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులో సంబంధితుల బ్యాంక్ ఖాతా వివరాలు తప్పనిసరిగా నమోదుచేయాలి. అప్‌లోడ్ చేసిన తర్వాత ఒక కోడ్ ఇస్తారు. ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్‌ను సంబంధిత దవాఖానలకు అధికారులు పంపి నిర్ధారించుకుంటారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే సీఎంఆర్‌ఎఫ్ అప్లికేషన్‌ను ఆమోదించి క్లెయిమ్ చెక్కును సిద్ధం చేస్తారు. చెక్‌పై దరఖాస్తుదారుడి అకౌంట్ నంబర్‌ను ముద్రిస్తారు. దీని వల్ల చెక్కు పక్కదారి పట్టే అవకాశం ఉండదని ప్రభుత్వం భావిస్తున్నది. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్కులను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు.

దేవాదాయ భూముల్లో 'సోలార్'

మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): దేవాదాయశాఖ భూముల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికను రూపొందించాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో దేవాదాయశాఖ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదాయంలేని, శిథిలావస్థకు చేరుకున్నదేవాలయాలను అభివృద్ధి చేసేందుకు కామన్ గుడ్ ఫండ్ నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. టీజీ రెడ్కో సహకారంతో ఆర్థికంగా ఉపయుక్తంగాలేని భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు విధివిధానాలను రూపొందించాలని, దేవాలయాలపై సౌర విద్యుత్ ఫలకలను ఏర్పాటు చేసేందుకున్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భద్రకాళి దేవాలయం, యాదగిరి గుట్ట దేవాలయాలపై ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద సీజీఎఫ్‌కు రూ.150 కోట్ల నిధులను కేటాయించాలని సీఎంను కోరతామన్నారు. బోనాల కోసం విడుదల చేసిన రూ. 20కోట్లను దేవాలయాలకు మంజూరు చేయాలని తెలిపారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు పాల్గొన్నారు.

ఐఏఎస్‌లు పాలనపై దృష్టిసారించాలి

- వారానికో రోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- 2 వారాల్లో ఫ్లాగ్‌షిప్ ఐడియా ఇవ్వండి
- ఐఏఎస్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- త్వరలోనే జిల్లాల పర్యటనకు ముఖ్యమంత్రి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఐఏఎస్ అధికారులు ఇకపై పాలనపైనే దృష్టిసారించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం అన్ని విభాగాల కార్యదర్శులతో ఆయన సమావేమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీల్లో అయిదింటిని అమలు చేసిందని చెప్పారు. తర్వాత వంద రోజులు ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయని గుర్తుచేశారు. ఇకపై ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేయాలని, తమ పరిధిలోని శాఖలు, విభాగాలపై పట్టు సాధించాలని స్పష్టంచేశారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉన్నదని తెలిపారు. తమ శాఖల పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని వెల్లడించారు. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్‌షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని, ప్రతిరోజు టైమ్ ప్రకారం సెక్రటేరియట్‌లో అందుబాటులో ఉండాలని అన్నారు. ఆఫీసులకే పరిమితం కాకుండా తమ విభాగం పనితీరును పర్యవేక్షించేందుకు వారానికి ఒకరోజు విధిగా జిల్లాలకు క్షేత్రపర్యటనకు వెళ్లాలని ఆదేశించారు. నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, సంబంధిత విభాగం చేపట్టిన కార్యక్రమాలు, పనుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. చాలా జిల్లాల్లో కలెక్టర్లు ఆఫీసులు దాటడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, తమ అనుభవంతో సుపరిపాలన విధానాలు అమలు చేయాలని సూచించారు. విధిగా కలెక్టర్లు కూడా క్షేత్ర పర్యటనకు వెళ్లేలా చూడాలని ఆదేశించారు. దవాఖానలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలందించే అన్ని విభాగాలను అప్పుడప్పుడు సందర్శించాలని చెప్పారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు, అనూహ్యంగా జరిగే సంఘటనలు, దుర్ఘటనలన్నింటా అధికారులు సత్వరమే స్పందించాలని స్పష్టం చేశారు. అన్నిశాఖల్లో మెరుగైన విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం గుర్తుచేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. వ్యక్తిగతంగా అధికారులపై రాగద్వేషాలేమీ లేవని, పని తీరు ఆధారంగానే ప్రోత్సాహకాలుంటాయని భరోసా ఇచ్చారు. సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దని, సీఎం కార్యాలయం ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. త్వరలోనే తాను వారానికో జిల్లా పర్యటనకు వెళ్తానని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. త్వరలో షెడ్యూలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రి, 29 విభాగాలకు చెందిన ఐఏఎస్‌లు పాల్గొన్నారు.

మంత్రి దామోదరకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ప్రతినిధులు

అత్యవసర మందులన్నీ అందుబాటులో ఉండాలి

ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తాం • వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర ఆదేశం

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులతోపాటు పాముకాటు నివారణ మందులు అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భౌగోళికంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా దవాఖానలు ఎంత దూరంలో ఉన్నాయో హెల్త్ ఫెసిలిటీస్ మ్యాపింగ్‌ను సిద్ధం చేయాలని టీజీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సహదేవరావు, ఈడీ కౌటిల్య, చీఫ్ ఇంజినీర్ దేవేందర్‌కుమార్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో విశాలాక్షి పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు..

తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో మంత్రి దామోదరను మంగళవారం కలిశారు. సమస్యలను మంత్రికి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు 12,900 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని, పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. తమకు వెంటనే శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని విన్నవించారు. ఈ అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వేదిక నాయకులు రమేశ్, శంకర్‌ముదిరాజ్, బాలబ్రహ్మాచారి, వెంకట్‌రెడ్డి, హుస్సేన్, మోహన్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై వీడియోలు ప్రదర్శిస్తేనే షూటింగ్‌లకు అనుమతి

- సినీ పరిశ్రమకు సీఎం రేవంత్ హెచ్చరిక
- మీడియా కూడా డ్రగ్స్‌పై దృష్టి పెట్టాలి
- డ్రగ్స్ అంటే వెన్నులో వణుకు పుట్టాలి
- సైబర్, టీన్యాబ్ వాహనాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, అత్యాశకుపోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకునే విధానాలపై సినీ పరిశ్రమ 1-2 నిమిషాల నిడివిగల వీడియోలను రూపొందించి, సినిమా ప్రదర్శనకుముందు థియేటర్లలో ప్రదర్శించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. లేకపోతే షూటింగ్‌లు, టికెట్ ధరల పెంపునకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో, యాంటీ నార్కోటిక్ బ్యూరోలు కొనుగోలు చేసిన 155 వాహనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డ్రగ్స్, సైబర్ నేరాలను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని, అందుకోసం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగస్వామి అయిన మెగాస్టార్ చిరంజీవిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయనలా హీరో, హీరోయిన్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పౌరులకు అవగాహన కల్పించాలని కోరారు.

రాజకీయాలపై మీడియా ఫోకస్ తగ్గించాలి

మీడియా ఫోకస్ రాజకీయ అంశాలకే పరిమితం కాకూడదని, డ్రగ్స్, సైబర్ నేరాలపైనా దృష్టిసారించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ యజ్ఞం విజయవంతమయ్యేందుకు పౌరసంబంధాలశాఖ, పోలీసు, ఎక్సైజ్, ఫైర్, థియేటర్ యజమానులు, సినిమా ప్రముఖులు, మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై చిత్తశుద్ధితో పనిచేసే పోలీసులకు పదోన్నతులు, రివార్డులు ఇస్తామని తెలిపారు.

డ్రగ్స్, సైబర్ నేరాలు ప్రపంచ సమస్య

ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సైబర్ క్రైమ్స్, డ్రగ్సేనని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన నేరాలు, చిన్నారులపై అఘాయిత్యాలు డ్రగ్స్ మత్తులో జరిగినవేనని పేర్కొన్నారు. ఉద్యమాలకు కేరాఫ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్‌కు బానిస కావొద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తా, హోంశాఖ కార్యదర్శి డాక్టర్ జితేందర్, ఏడీజీలు శిఖాగోయెల్, డీజీ (రిటైర్డ్) సందీప్ శాండిల్య, ట్రై కమిషనరేట్ల సీపీలు కొత్తకోట శ్రీనివాసరెడ్డి, తరుణ్‌జోషీ, అవినాశ్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అది నా బాధ్యత: చిరంజీవి

డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మెగాస్టార్ చిరంజీవి ఓ వీడియోను విడుదల చేయడాన్ని సీఎం అభినందించినట్టు పోలీసు శాఖ ఎక్స్‌లో తెలిపింది. దీనికి స్పందించిన చిరంజీవి 'ధన్యవాదాలు రేవంత్‌రెడ్డిగారు.. డ్రగ్స్ నిర్మూలన విషయాన్ని ప్రజలకు తెలపడం నా బాధ్యత' అంటూ రీపోస్ట్ చేశారు. ఇదే అంశంపై హీరో మోహన్‌బాబు స్పందిస్తూ.. చలన చిత్ర నటులు 1-2 నిమిషాల నిడివిలో వీడియో చేసి ప్రభుత్వానికి పంపమన్నారు.

'డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాలి'

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ అరుణను వెంటనే తొలగించాలని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. లేదంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. మంగళవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయానికి తరలివచ్చారు. డీఎంఈ డాక్టర్ వాణిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. దవాఖాన సిబ్బందితోపాటు రోగులు, విద్యార్థులను ప్రిన్సిపాల్ అరుణ అకారణంగా వేధిస్తున్నారని వాపోయారు.

డీపీహెచ్ రద్దు దుర్మార్గమైన ఆలోచన : యూఎంహెచ్ఈయూ

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : వైద్యారోగ్య రంగానికి గుండెకాయ లాంటి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీపీహెచ్) విభాగాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ పేర్కొన్నది. ఈ ఆలోచనను విరమించుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫసియుద్దీన్, ప్రధాన కార్యదర్శి యాదనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. టీవీవీపీ, డీపీహెచ్‌ను కలిపి కొత్త డైరెక్టరేట్ ఏర్పాటు చేయనున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయా విభాగాల ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. టీవీవీపీకి ట్రెజరీ ద్వారా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

రేపు క్యాబినెట్ విస్తరణ?

› మొదటిపేజీ తరువాయి...

రాహుల్‌గాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదానికి పంపించారు. వారి నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించిన జాబితాను బుధవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డికి అందించనున్నారు. దీనికోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మరోసారి బుధవారం ఉదయం ఢిల్లీకి చేరుకుంటారు. మంత్రివర్గ విస్తరణ కసరత్తు పూర్తికావడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమంపై సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో చర్చించి వచ్చారు.

ఎవరెవరికి చాన్స్?

మంత్రివర్గంలో ఇప్పటివరకు ప్రాతినిధ్యం లభించని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పీ సుదర్శన్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్న నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్లు దాదాపు ఖరారు అయినట్టు సమాచారం. పార్టీ సీనియర్ నేత, సీడబ్ల్యూసీ సభ్యుడు, మంత్రి దామోదర రాజనరసింహ కథనం ప్రకారం దానం నాగేందర్‌కు కూడా మంత్రి పదవి దక్కే అవకాశం ఉన్నది. ఆదిలాబాద్ జిల్లా కోటాలో తన పేరు పరిశీలనలో ఉన్నట్టు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ధీమాగా ఉన్నారు. మంత్రివర్గంలో ఎస్టీల్లో లంబాడి సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడంతో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పేరు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్టు చెప్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రిమండలిలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా ఢిల్లీలోనే మకాం వేసి లాబీయింగ్ చేస్తున్నారు. మంత్రిమండలిలో ఆరు ఖాళీలు ఉండగా నాలుగు లేక ఐదింటిని మాత్రమే భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తుండగా, వీటి కోసం పది మంది ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు.

మంత్రుల సంఖ్య పదిహేడా? పద్దెనిమిదా?

మంత్రుల సంఖ్య పద్దెనిమిదా? లేక పదిహేడా? అనే అంశంలో వివాదం నెలకొన్నది. ఎమ్మెల్యేల సంఖ్యలో మంత్రుల సంఖ్య 15 శాతానికి మించకూడదనే నిబంధన. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డితో కలిపి మంత్రుల సంఖ్య 12 కాగా ఇంకా ఆరు ఖాళీలు ఉన్నాయనేది ప్రభుత్వ వాదన. చట్టసభల్లో ఆంగ్లో ఇండియన్ సభ్యున్ని నియమించే ఆనవాయితీని కేంద్రం తొలగించింది. దీంతో మొత్తం 119 మంది ఎమ్మెల్యేలను పరిగణనలోకి తీసుకుంటే మంత్రుల సంఖ్యను 17కు పరిమితం చేయాల్సి ఉంటుంది.

అబద్ధాలకు తల్లి కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచందర్‌రావు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అబద్ధాలకు తల్లిలాంటిదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ తీరుతో దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని చెప్పారు. రాహుల్ హిందువేనా? అని ప్రశ్నించారు. హిందువు అయితే అటువంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారు? అని నిలదీశారు. కిషన్‌రెడ్డి మీద పోటీ చేసింది దానం నాగేందర్ కాబట్టే ఆయన మీద అనర్హత పిటిషన్ వేశామని స్పష్టత ఇచ్చారు.

చారిత్రక ఆలయాల పునరుద్ధరణకు కమిటీ

హైదరాబాద్, జూలై 2(నమస్తే తెలంగాణ): శిథిలావస్థకు చేరుకున్న చారిత్రక ఆలయాలను పరిశీలించి వాటి పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రణాళికలు రూపొందించేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి రెవెన్యూ శాఖ(ఎండోమెంట్స్) ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా పురావస్తు శాఖ డైరెక్టర్, కో-కన్వీనర్‌గా దేవాదాయ శాఖ డైరెక్టర్, సభ్యుడిగా వైటీడీఏ వైస్ చైర్మన్ కృష్ణారావు ఉంటారు. ఆర్కిటెక్ట్ సత్యనారాయణ మూర్తి ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరిస్తారు.